

కథా కౌముది

# చూపు

శ్యామ్ అవ్వారి

'టప్'మని చేతిమీద నీటి చుక్క పడింది. అతడు తలెత్తి ఆకాశం వైపు చూసాడు. వర్షం వచ్చేలా ఉంది.

"తను త్వరగా వస్తే బావుణ్ణు" అనుకున్నాడు అతడు.

తలతిప్పి చూసాడు పక్కనే ఉన్న శ్మశానం వైపు. అంతా నిశ్శబ్దం! పడుకున్నవాళ్ళ సద్దు లేదు. అతని చూపు అప్పుడే కట్టిన ఒక్క కొత్త సమాధి పైన నిలిచింది. అంతటా నిశ్శబ్దం, అంతరంగంలో తప్ప!

"తను త్వరగా వస్తే బావుణ్ణు" మళ్ళీ అనుకున్నాడు అతడు. అతని ఆలోచన పూర్తి కాక మునుపే దూరంగా ఒక కారు దుమ్ములేపుకుంటూ వచ్చి ఆగింది. నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ కారు ఇంజిన్ ఇంకొకసారి రొదపెట్టి ఆగింది!

అతడు అప్రత్నయంగా ఒక అడుగు ముందుకేసి ఆగాడు. కారు ముందు డోర్ తెరుచుకుని ఒక యువకుడు దిగాడు. ఆ యువకుడు తలతిప్పి వెతుకుతున్నట్టు అటూ ఇటూ చూసాడు. దూరంగా ఉన్న అతణ్ణి చూసి 'హలో' అన్నట్టుగా చేయి లేపాడు.

అతడు కూడా చేయి ఊపాడు.

ఆ యువకుడు కారు వెనుక డోర్ తెరిచాడు.

దూరంలో ఉన్న అతడికి ఏమి కనిపించడం లేదు! అతడి గుండె వేగం పెరిగింది. కారులో నుండి దిగిన వ్యక్తి సరిగ్గా కనిపించడం లేదు. ఆ యువకుడు పక్కకు జరిగాడు. ఆమె కనిపించింది. అతడి శ్వాస బరువెక్కింది. దూరంనుండి క్లియర్ గా లేకపోయినా తనను గుర్తుపట్టగలడు! 30 సంవత్సరాలు కాదు, ఇంకా 30 సంవత్సరాలు వచ్చినా ఆమెను గుర్తుపట్టగలడు.

ఆమె కూడా దూరం నుండి అతడిని చూసింది. ఒక్క క్షణం ఆమె అడుగు తడబడింది. ఆ యువకుడు ఆమె చేయి పట్టుకున్నాడు. ఆమె అతని సాయంతో అతడి వైపు నడవసాగింది. 30 సంవత్సరాల దూరం ౩౦౦ వందల గజాల దూరంగా మిగిలింది.

ఆమె ఆగింది. ఆ యువకుడితో ఏమో మాట్లాడుతుంది. ఆ యువకుడు ఆమె చేయి వదిలేసాడు. ఆమె ఆ యువకుడి చెంప చిన్నగా తట్టి మళ్లా నడవసాగింది అతని వైపు. ఆ యువకుడు ఒక్క నిమిషం పాటు ఆమెనే చూస్తూ ఉండిపోయాడు. ఆ తరువాత వెనుదిరిగి కారు వైపు వెళ్ళిపోయాడు.

ఆమె దగ్గరగా వస్తున్నాకొద్దీ అతడి గుండె వేగం పెరగసాగింది. ఆమె నడకలో ఏ మాత్రం తేడాలేదు సరికదా ఇంకాస్త వేగం పెరిగింది. ఆమె పూర్తిగా దగ్గరకు వచ్చింది.

అతడు చిరునవ్వు నవ్వబోయాడు, నవ్వు పూర్తిగా విరియలేదు. ఏదో మాట్లాడదాము అనుకున్నాడు. కానీ మాట పెదవి దాటకముందే ఆమె అతడిని గట్టిగా కౌగిలించుకుంది. అతడు నిలువెల్లా కదిలిపోయాడు.

“30 సంవత్సరాలు” అన్నది ఆమె!

“30 సంవత్సరాలు” ఒప్పుకున్నాడు అతడు!

“30 సంవత్సరాలు ఎక్కడికి పోయాయి కామేశు?” అన్నది ఆమె!

అతడు మౌనంగా ఆమెని పట్టుకుని ఉండిపోయాడు.

కొద్దిసేపటికి ఆమె అతడి నుండి విడివడింది.

“నిన్ను చూడనీ పూర్తిగా” అంది!

అప్పుడు గమనించాడు అతడు.

“నీ కళ్ళద్దాలు?” సగంలో ఆపాడు.

చిన్నగా నవ్వింది ఆమె.

“ఇప్పుడే వస్తుంటే కిందపడి పగిలిపోయాయి. మావాడు కొత్తవి కొందామంటే సమయం లేదని వచ్చేసాను. అయినా నిన్ను చూడడానికి నాకు అద్దాలేందుకు చెప్పు? నా కళ్ళముందు ఆనాటి నువ్వే కనిపిస్తున్నావు!”

అతను ఏమీ మాట్లాడలేదు. ఆమె మళ్లా అతడిని గట్టిగా కౌగిలించుకుంది.

ఒక్క క్షణం తరువాత అతడు ఆమెని తననుండి విడదీసాడు.

“ఇక్కడ కూర్చుని మాట్లాడుకుందాం”, పక్కనే ఉన్న బెంచి వద్దకు తీసుకెళ్ళాడు.

ఇద్దరూ అలా కొద్దిసేపు మౌనంగా కూర్చున్నారు. అతడు ఏమో చెప్పబోయాడు. ఆమె తన చేతులతో అతడి నోటిని మూసింది.

"నువ్వు ఎప్పుడూ మాట్లదేవాడివి.  ఇప్పుడు నేను మాట్లాడుతాను నువ్వు వినాలి అంతే!"

అతడు మౌనంగా తల ఊపాడు.

ఆమె మాట్లాడడం మొదలుపెట్టింది.

---

ఆ యువకుడు టైమ్ చూసుకున్నాడు.  వచ్చి రెండు గంటలవుతుంది.  చేతిలో ఉన్న రాయిని దూరంగా విసిరేసి, ఒకసారి తలతిప్పి చూసాడు. అమ్మ మాట్లాడుతూ కనిపించింది.  కారు తలుపు తెరిచి సీట్ బాగా వెనక్కు వాల్చి కూర్చుని కళ్ళు మూసుకున్నాడు.

---

"అలా రోజులు సంవత్సరాలు గడచిపోయాయి.  ఆయన అనుమానాలు అవమానాలు తట్టుకుంటూ, నిన్ను వదులుకున్నందుకు తిట్టుకుంటూ జీవించాను. నా అదృష్టం కొద్దీ నా కొడుకు, తండ్రిలా కాక, ఒక మనిషిలా మారాడు. ఆయన పోయాక వాడికి నిన్ను చూడాలనే నా కోరికని చెప్పాను.  వాడే నిన్ను వెతికి పట్టుకొని ఇక్కడికి తీసుకొచ్చాడు."

అతడు తలతిప్పి కారు వైపు చూసాడు.  ఆ యువకుడు కనిపించలేదు.

ఎక్కడో పెద్ద ఉరుము ఉరిమింది.  అప్పుడు అర్థమయ్యింది ఎంత మసకగా మారిందో ఆ వాతావరణం.

"ఇక బయలుదేరుదామా? చాలసేపైంది మనమిక్కడ కూర్చుని.  అక్కడ మీ అబ్బాయి కూడా wait చేస్తుంటాడు!"

"నిన్ను వదిలి వెళ్లాలని లేదు, కాని వెళ్లక తప్పదు!'

అతడు చిన్న నవ్వు నవ్వాడు.

"పోనీ ఉండిపోనా? నాకు నీతో మిగిలిన జీవితం గడపాలని ఉంది!"

అతడు ఆమె తల నిమిరాడు.  "బయలుదేరుదామా?"

ఆమె ఒక నిట్టూర్పు విడిచింది.  "అర్థమైంది!"

ఇద్దరూ లేచారు.

"వెళ్లేముందు, నువ్వెంత కాలమో అడిగింది, నేను ఇంతకాలంగా ఇవ్వాలని వేచి చూసింది ఇచ్చి వెళ్తాను!" ఆమె తల ఎత్తి తన పెదాలను అతని పెదాల వద్ద తెచ్చింది.

ఆ యువకుడు తల తిప్పి చూసాడు. వారిరువురు దగ్గరగా ఉండడం కనిపించింది. చప్పున తల తిప్పేసుకున్నాడు.

+++++++++++++++++++++++++++++++++++++++++++++++++++++++++

కొద్దిసేపటికి ఆమె దూరంగా జరిగింది. అతడు ఇంకా అలా నిశ్చేస్టుడై ఉండిపోయాడు.

"వెళదామా?" ఆమె అడిగింది.

ఇద్దరూ కారు వైపు నడిచారు.

అడుగుల శబ్దం విని ఆ యువకుడు లేచి నించున్నాడు.

వారిద్దరూ కారు వద్ద ఆగారు.

ఆమె అతని చేయి మీద చేయి వేసింది. "మళ్లా ఎప్పుడు?"

అతను ఆమె చేతి మీద చేయి వేసాడు. "ఎప్పుడు వీలవుతే అప్పుడు"

ఆ యువకుడు కారు తలుపు తెరిచి పట్టుకున్నాడు. ఆమె లోపలికి జరిగి కూర్చుంది. ఆ యువకుడు తన వైపు తలుపు తెరిచాడు.

"ఒక్క క్షణం!". అతడు ఆ యువకుడిని ఆపాడు. తన జేబులు తడుముకొని ఒక చిన్న పేపర్ తీసి కారు టాప్ మీద పెట్టి పెన్ను ఏదో రాసాడు.

"Please! give it to her once you reach home!" ఆ పేపర్ని మడిచి ఆ యువకుడి చేతికి ఇచ్చాడు. ఆ యువకుడు ఒక క్షణం ఇతని వైపు చూసి, పేపర్ జేబులో పెట్టుకున్నాడు.

లోపలినుండి ఆమె చేయి ఊపుతుండగా, కారు వెళ్ళిపోయింది. అతడు అక్కడే మిగిలిపోయాడు.

+++++++++++++++++++++++++++++++++++++++++++++++++++++++++

**(ఒక నెల తరువాత)**

"మాధవ్ గారికి నమస్కారం! కొంత ఆలస్యంగా ఈ ఉత్తరం రాస్తున్నందుకు క్షమించాలి!

అమ్మ చనిపోయింది!"

అతడు ఉత్తరం చదవటం ఆపాడు. తలెత్తి ఆకాశం వైపు చూసాడు. మసకగా కనిపించింది. కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకున్నాడు.

గాలి వేగం పుంజుకుంది. గాలికి చేతిలోని ఉత్తరం రెపరెపలాడుతుంది. మళ్లా చదవడం ప్రారంభించాడు.

"మిమ్మల్ని కలిసాక తిరిగి వస్తుంటే అమ్మ ఎంత సేపు మాట్లాడిందో మీకు చెప్పలేను. అమ్మ మాటల్లో పట్టలేనంత ఆనందం. తన చిన్ననాటి కబుర్లు, మీ జ్ఞాపకాలు, అలా చెపుతూనే ఉంది. నన్ను ఒక్క క్షణం కూడా

మాట్లాడనివ్వలేదు. అంత సంతోషంగా ఉండింది అమ్మ! నాకు ఊహ తెలిసినప్పటినుండి అమ్మని ఇంత సంతోషంగా నేను ఎన్నడు చూడలేదు. నాన్న తిట్లకి దెబ్బలకి అల్లల్లాడుతూ మూగదైపోయిన అమ్మ మాత్రమే నాకు గుర్తుకుంది. అలాంటి అమ్మ ఇంతలా మాట్లాడుతూ ఉంటే నా సంతోషానికి పగ్గాల్లేవు. అలా మాట్లాడుతూ మాట్లాడుతూ అమ్మ నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది. ఇంటికి చేరాక తెలిసింది, అది నిద్ర కాదని, శాశ్వత నిద్ర అని. అమ్మ ముఖంలో ప్రశాంతత నాకింకా గుర్తుకుంది. జీవితం మొత్తం ఏడిపించిన ఆ దేవుడు చివరి నిముషంలో మాత్రం అమ్మని చిరునవ్వుతో తీసుకెళ్ళిపోయాడు. అమ్మ మొఖంలో మిమ్మల్ని కలిసిన ఆనందం అలానే ఉండిపోయింది. నాకు అప్పుడు దేవుడి మీద చాలా కోపం వచ్చింది. ఆవిడని మీతో ఇంకొద్దిసార్లు కలవనిచ్చి సంతోషంగా ఉంచితే ఏం పోయేది?"

అతడు చదవడం ఆపాడు. అతని పెదాల మీద ఆ నాటి ముద్ర ఇంకా నిలబడిపోయింది.

"అమ్మని లోపల తెచ్చి పడుకోబెట్టాము. ఇల్లంతా గోల గోల. నాకదేమి వినిపించలేదు. అమ్మని అలానే చూస్తూ ఉండిపోయాను. నాకేమి ఏడుపు రాలేదు. ఎందుకు రావాలి? అమ్మ సంతోషంగా వెళ్ళిపోయింది. అలా చూస్తూండగా, మీరు రాసిన నోట్ గుర్తుకొచ్చింది. అమ్మకి చదివి వినిపించాలని జేబులోనుండి తీసి చదివాను. ఒక్క క్షణం నాకాళ్ళ కింద భూమి కదిలిపోయింది అనిపించింది. అప్పుడు ఏడ్చాను సర్! అప్పుడు వెక్కి వెక్కి ఏడ్చాను! అమ్మ కోసం ఏడ్చాను. అమ్మను తలుచుకొని ఏడ్చాను. అమ్మ ఒక్క చిన్న కోరిక కామేశ్వర్ గారిని కలవాలని. అది తీర్చనందుకు ఏడ్చాను. అమ్మను దేవుడు మోసం చేసాడు. మీరూ మోసం చేసారు. కానీ నాకు మీమీద కాని, ఆ దేవుడి మీదకాని కోపం రాలేదు. ఎందుకో తెలుసా? అమ్మ కామేశ్వర్ గారినే కలిసానన్న తృప్తితో వెళ్ళిపోయింది. ఆమెకి ఆయన ఈమధ్యనే చనిపోయాడన్న నిజం తెలిస్తే ఆ బాధ తట్టుకోలేక జీవితాంతం మిగిలిపోయేది. అలాంటి బ్రతుకు కంటే ఇలా సంతోషంగా వెళ్ళిపోవడం మంచిదైంది. అందుకేనేమో దేవుడు ఆమెను నిజం తెలియక ముందే అంత వేగంగా తీసుకెళ్ళిపోయాడు.

ఆ నోట్ ని అమ్మ చితి మీద వేద్దామనుకున్నాను కాని భయం వేసింది. అమ్మకి నిజం అక్కడ తెలిసినా తట్టుకోలేదు. అందుకే చింపేసాను. చిన్న చిన్న ముక్కల కింద చింపేసాను. ఈ విషయం తెలిసింది ఇక మన ఇద్దరికే.

మీరు ఉన్న చిన్న ఊళ్ళో ఇంటర్నెట్ లేదని తెలుసు కాబట్టి ఈ ఉత్తరం రాస్తున్నాను. మీరు అమెరికా తిరిగివెళ్ళి పోయే లోపు ఈ ఉత్తరం మీకు అందుతుందని ఆశిస్తున్నాను.

అన్నట్లు, మిమ్మల్ని అమ్మ అంత్యక్రియలకు కావాలనే పిలవలేదు. మీరు అమ్మ దరిదాపుల రావడం కూడా నాకు ఇష్టం లేదు. ఆమె కామేశ్వర్ నే చూసింది. అది అలానే ఉండిపోవాలి.

మీకు శాశ్వతంగా సెలవు!"

ఆ ఉత్తరం మీద ఒక నీటి చుక్క పడింది. అతడు ఆ ఉత్తరాన్ని అలానే నెల మీదకు వదిలేసాడు. ఒక గట్టి గాలి ఆ ఉత్తరాన్ని అలా ఎగరేసుకు పోయింది.

అతడు వెనుకకు తిరిగి నడవడం మొదలుపెట్టాడు.

"నన్ను క్షమించరా కాముడు! నువ్వు లేవన్న నిజాన్ని చెప్పడానికే నేను అక్కడ వేచి చేసాను. కానీ ఆరోజు తను వినే స్థితిలో లేదు. చిన్నపటినుండి మనమిద్దరం ఒకే తల్లికి పుట్టిన బిడ్డల్లా ఉన్నామనడం ఇక్కడ ఈ విధంగా పనికొచ్చింది. నేను నిజం చెప్పలేక పోయాను, కాని అబద్ధం కూడా ఆడలేదు. అందుకు మీరిద్దరూ నన్ను క్షమించాలి"

గాలి వేగం పుంజుకుంది!

COMMENTS